# 21. మాలతికి మళ్లీపెళ్ళి

మాలతికి సంబంధం కుదిరింది.

దానితో నాకు కూడా ప్రమేయముంది.

పెళ్ళి కొడుకు తండ్రి మోహనరావు, నేను అయిదవ తరగతి నుండి స్కూలు ఫైనలు వరకు కలిసి చదువుకున్నాం. హైస్కూలు చదివిన తరువాత మేము విజయనగరంలో ఇంటరు చదువుకున్నాం. ఇంటర్ తరువాత అతను కాకినాడలో ఇంజినీరింగ్ కాలేజీలో చేరాడు. నేను విశాఖపట్నంలో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఆనర్సులో చేరాను. తరువాత మా దారులు వేరయాయి. అతను చీఫ్ ఇంజనీరుగా పనిచేసి రిటైరయాడు. నేను కాలేజి ప్రిన్సిపాలుగా రిటైరయాను. కాకినాడ అతను వెళ్ళిన దగ్గర నుంచి మేము దూరమయ్యాం. అతనికి చాలా బాధ్యతగల ఉద్యోగం. అతను నా గురించి మరచిపోవడంలో అర్థముంది. కాని ఉపాధ్యాయ పదవిలో ఉన్న నేను మరచిపోవడం క్షమించరానిది.

మోహనరావు రిటైరయిన తరువాత హైదరాబాదులో స్థిరపడ్డాడు. మంచి మూడు పడక గదుల ఫ్లాటు కొనుక్కున్నాడు. అతనికొక కూతురు, కొడుకు, కూతురు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫిజిక్సు ఎమ్మెసీ చేసి ఒక గుజరాతీని పెళ్ళిచేసుకొని అక్కడే ఉండిపోయింది. అల్లుడు హైకోర్టు జడ్జిగారి కొడుకు - పెళ్ళికొడుకు ఐఏయస్ పాసయి. మధ్యప్రదేశ్‌లో కలెక్టరుగా పనిచేస్తున్నాడు.

ఈ విషయాలు ఎలా నాకు తెలిసాయని మీకనిపిస్తుంది. హైదరాబాదు వెళ్తే మినిస్టరుగారి కూతురు పెళ్ళిలో కలిశాము. క్రమంగా అతని గురించి చాలా సంగతులు తెలిసాయి. మనిషి చాలా నిజాయితీ పరుడు. ముక్కుసూటిగా నడుచుకుంటాడు. రూల్సు అంగీకరిస్తే ఉపకారం చేసేవాడు - కాకపోతే....

అతను పైకి రావడానికి అతని మామగారు కారణమంటారు. అతను సెక్రటరీగా ఉండేవాడు. మంచి పలుకుబడిఉంది. అందుచేత ననుకుంటా ఉద్యోగ జీవితం నల్లేరు మీద బండి వలె నడిచింది. ఏ ఆటంకాలు లేకుండా రిటైరయాడు.

పెళ్ళిలో కలుసుకున్న తరువాత అప్పుడప్పుడు మేము ఉత్తరాలు వ్రాసుకున్నాం. అతడు అంత ఆప్తుడు కాబట్టే మాలతి గురించి నేను చెప్పాను. అతను విన్నాడు.

నేను కట్టుకున్న ఇంట్లో అద్దెకున్న తసిల్దారు సీతారామయ్యగారి ఏకైక పుత్రిక - ఆమె తల్లి చిన్నప్పుడే పోయింది. అతను మరి పెళ్ళి చేసుకోలేదు - తలచెడిన అతని చెల్లెలు అన్నగారిని, మేనకోడలిని చూసుకుంటూ ఉండిపోయింది.

నేను మంచి ఇల్లు కట్టించుకున్నాను. నేనుండగా సగం భాగం ఉండిపోయింది.

నాకు నా భార్యకు అంత పెద్ద ఇల్లు దేనికి? పైగా అప్పుడు తాసిల్దారుగారు అడగడం, మేము అద్దెకివ్వడం జరిగింది.

మా యింట్లో సీతారామయ్యగారు దిగేసరికి మాలతిని పధ్నాలుగేళ్ళు. పదో తరగతి చదివేది. ఇప్పుడామె బి.ఏ. పరీక్షకు వ్రాసింది.

సీతారామయ్యగారు చాల ఉత్తములు. ఎక్కడా చెయ్యి చాచినట్లు వినలేదు.

మాలతి గురించి చెప్పడానికి బదులు ఈ డొంక తిరుగుళ్ళు దేనికి.

మాలతిచక్కగా ఉంటుంది. ఏపుగా పెరిగింది. బాగా మాట్లాడుతుంది. నవ్వుతూ నవ్విస్తుంది - ఎప్పుడూ ఖాళీగా ఉండదు. ఏదో పని చేస్తుంటుంది. నా భార్యతో ఏవో ఇంటి కబుర్లు చెప్పి, పనులు సాయం చేసేది. నాతో పాటు పెరటిలో పూల మొక్కలకు పాదులు కట్టి చిక్కుడు తీగకి దొండ పాదులకి పందిళ్ళు వేసేది - ఒక్క ఆరునెలలోనే పెరటి స్వరూపమే మారిపోయింది.

బి.ఏ. పరీక్షకు వ్రాసే దాకా సీతారామయ్యగారు మాలతి పెళ్ళి గురించి ఆలోచించలేదు - అప్పటికి ఆమెకు పద్దెనిమిదేళ్ళు. యవ్వనం కొట్టవచ్చినట్లు కనిపించేది. మాటలలో తీయదనం, మనసులో అన్యోన్నత ఆమెకు సహజమైన గుణాలు.

పై చదువులు చదివించడమా, లేక పెళ్లి చేయడమా అన్న సంగతి ఒక రెండు గంటలు సీతారామయ్యతో చర్చలు జరిపాను. పెళ్ళిచేయడానికి అతను ఒక నిశ్చయానికి వచ్చారు.

ఇటువంటి పరిస్థితులలో నేను హైదరాబాదులో మోహనరావును కలియడం తటస్థించింది. మాటల సందర్భంలో అతని కొడుకుకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నట్లు చెప్పాడు. పిల్ల అన్ని విధాల బాగుంటే, బి.యే. పాసయినా చాలు అన్నాడు.

ఒక ఆరు నెలలు మోహనరావుకి నాకూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. మాలతి గురించి అతను అన్నిసంగతులు తెలుసుకున్నాడు. ఆమె బి.ఏ.లో విశ్వవిద్యాలయానికి మొదటిదిగా వచ్చింది. ఉత్తమ గృహిణిగా ఒక కలెక్టరు కాపురం చక్కదిద్దడానికి అన్ని యోగ్యతలు మాలతికి ఉన్నాయని మోహనరావుకి విశ్వాసం కలిగిన తరువాత అతడు పెళ్ళి చూపులకు అంగీకరించాడు.

మోహనరావు కొడుకు పేరు సుధాకర్. తండ్రి ఎంత నిరాడంబరమైనవాడో, కొడుకు అంత గొప్పలకు పోవలసినవాడు - పిల్లను ఒక ఐదు నక్షత్రాల హొటలులో చూడడానికి అన్ని ఏర్పాటులు జరిగాయి. మాలతి బాంకు పరీక్షలకు తయారయింది - అందుచేత పెళ్ళి కొడుకు వేసిన జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు సులువుగా జవాబు చెప్పింది.

మరో మూడు నెలలు ఆలోచించిన తరువాత చివరకు సుధాకర్ ఒప్పుకున్నాడు.

కట్నం లేకుండా చాల ఘనంగా జరిపిన పెళ్ళికి ఆరు లక్షల రూపాయలు ఖర్చయాయి.

సీతారామయ్యగారు పిల్ల కోసం జాగ్రత్త చేసిన దల్లా పిల్ల పెళ్ళికి ఖర్చయి అతను పెన్షనరాళ్ల మీద బతకవలసిన స్థితి వచ్చింది. వాళ్ళు మరో చిన్న ఇంటికి మారి పోతామన్నా మాతో కొన్ని సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్న వాళ్ళు వెళ్ళిపోతామంటే నా భార్య ఒప్పుకోలేదు.

సీతారామయ్యగారి అల్లుడు ఒకసారి కూడా అత్తవారి గుమ్మం తొక్కలేదు. నేను నా భార్య మాలతిని అత్తవారింటికి దిగబెట్టి వచ్చాము. ఆషాఢ మాసం వచ్చింది. సీతారామయ్యగారే మాలతిని పుట్టింటికి తీసుకువచ్చారు.

మాలతి ఉదాసీనంగా కనిపించింది. ఆమె ముఖంలో చిరునవ్వు మాయమయింది. హుషారుగా తిరగడం కాని, మొక్కలకు సంరక్షణ చేయడంగాని చెయ్యలేదు. మాతో కూడా మనసు విప్పి మాట్లాడలేదు. ఇంతలో ఆషాఢమాసం వెళ్ళిపోయింది. సీతారామయ్యగారు పిల్లను అత్తవారింటికి దిగబెట్టి వచ్చారు.

అతను తిరిగివచ్చిన సాయంకాలం, డాబామీద ఇద్దరం కూర్చొన్నప్పుడు మాలతి గురించి గురించి అడిగాను. సుధాకర్ హైదరాబాదు బదిలీ అయి వచ్చాడని మాత్రం ఆయన చెప్పారు. సుధాకర్ తల్లి ఇంటి పెత్తనం చెలాయిస్తుంది. సుధాకర్ తల్లి మాటలు వినవలసినవాడు.

'మిమ్మల్ని గౌరవంగా చూశారా?' సీతారామయ్యగారిని ప్రశ్నించాను.

"మోహనరావుగారు ఆప్యాయంగా మాట్లాడాడు. మీ గురించి అడిగారు" అంతవరకు ఆయన చెప్పారు.

రోజులు గడిచిపోతున్నాయి. పెరటిలో పూలమొక్కలకి పాదులకు నీళ్ళు పొయ్యడానికి ఒక మనిషిని పెట్టాం. కాని ఆ మొక్కలు, పాదులు కళతప్పి కనిపించాయి.

మా అందరికీ మాలతి లేని లోటు కొట్టవచ్చినట్లు కనిపించింది.

ఎవరేనా స్నేహితులు హైదరాబాదు వెళ్తే మాలతిని చూసి రమ్మనే వారు సీతారామయ్యగారు. మిఠాయి, పువ్వులు పంపించేవారు. వచ్చిన వాళ్ళు చూస్తూ ఉండగానే, మాలతి అత్తగారు, వాటిని పనివాళ్ళకు పంచిపెట్టేవారు. వెళ్లిన వాళ్లు మాలతితో మాట్లానిచ్చేది కాదు ఆ మహా యిల్లాలు. కనీసం ఉత్తరాలు కూడా మాలతి నుండి రాలేదు.

చాలా కాలం తరువాత, ఒక సాయంకాలం మాలతి ఒక్కర్తే హైదరాబాదు నుండి బస్సు మీద వచ్చింది. అనారోగ్యం కారణంగా అత్తవారు ఆమెను పంపించారు. మంచి వైద్యం చేయిస్తే మాలతి పది రోజులలో కోలుకుంది. కంటికి రెప్పవలె మేనత్త కాపాడింది. మా ఆవిడ పగలల్లా మాలతితోనే ఉండేది.

మాలతి బాగా కోలుకున్న తరువాత ఆమె మేనత్త చాల ప్రయత్నం చేసి కొన్ని సంగతులు రాబట్టింది. అత్తగారు పులి - సుధాకర్ మేక - ఆమె మాటకు ఎదురు తిరగడు. మామగారు మంచివాళ్లే-కోడలి పక్షం మాట్లాడేవారు-తన స్నేహితుడు కుదిర్చిన సంబంధమని గౌరవిస్తారు - మాలతి పడుతున్నది మానసికమైన చిత్రహింస - ఇక దాంపత్యం విషయంలో - సుధాకర్ ఉద్యోగ బాధ్యతలతో అలసిపోయి ఏ రాత్రో ఇంటికి వస్తాడు - తాగుతాడు. పెళ్ళాం పట్ల కొంచమైనా అభిమానం చూపించదు - భార్యను హీనంగా చూస్తాడు.

ఒక నెల్లాళ్ళ తరువాత మాలతి అత్తవారింటికి వెళ్ళిపోయింది.

తరువాత అన్ని యథా ప్రకారమే.

ఒక ఆరునెలలకు మూలతి చాల దయనీయమైన స్థితికి దిగజారిపోయింది. - ఇంకా ఉపేక్ష చేస్తే మతిపోయే స్థితికి వచ్చింది. ఈ సంగతి తెలిసి అందరం చాలా బాధపడ్డాము.

మాలతిని చూసి, నాలుగు సంగతులు మోహనరావుతో మాట్లాడాలని నేను హైదరాబాదు వెళ్లాను. నేను మోహనరావు గారి బంగళా చేరేసరికి ఇంటిల్లిపాది ఆందోళనతో పరుగులు తీస్తున్నారు. అతనికి తీవ్రంగా గుండెపోటు వచ్చింది. ఒంటిమీద తెలివిలేదు. నేను వెళ్ళిన రెండు గంటలలో అతను చనిపోయాడు. నేను మాలతిని చూడలేదు. ఆమె మామగారితో మాట్లాడలేదు.

మరికొంతకాలం గడిచింది. ఒక సాయంకాలం మాలతి పుట్టింటికి తిరిగి వచ్చింది. అత్తవారు ఇంటి నుండి తగిలేశారు.

అన్నిటికన్న ముఖ్యమైన పని మాలతిని రక్షించుకోడం. ఆమె అత్తవారింటి సంగతులు ప్రస్తవించకుండా, ఆమెకు వేళపట్టున్న అన్నీ సమకూరుస్తూ చాలా జాగ్రత్త పడ్డాం.

కాలం చాల గొప్పది. క్రమక్రమంగా జ్ఞాపకాలను చెరిపివేస్తుంది. మనసును ఒక దారికి తెస్తుంది. మా ప్రయత్నాలలో కృతకృత్యులమయ్యేసరికి నెల్లాళ్ళు పట్టింది. మాలతి మా ఆవిడ దగ్గరికి రావడం మొదలుపెట్టింది. పెరటిలో పూల మొక్కలకు సంరక్షణకు నాకు సహాయం చేసేది. బాగా చదువుకున్నదేమో, ఇతర ప్రయత్నం లేకుండా తానే స్థిరపడింది. బాంకు అధికారుల పరీక్షలకు వ్రాసింది. ఆమె పూర్వపు మనిషయ్యేసరికి ఆరునెలలు పట్టింది.

ఆరు నెలలు గడచినా అత్తగారి నుండి ఏ పిలుపూ రాలేదు. సుధాకర్ తన హెూదాలోనే పనిచేస్తున్న మరొక మహిళతో తిరుగుతున్న వార్తలు వచ్చాయి.

ఒకనాటి సాయంకాలం నేను, సీతారామయ్యగారు మాలతి భవిష్యత్తు గురించి ఆలోచించాము. తొందరపడి ఏ నిర్ణయం తీసుకుంటే ఎలా పరిణమిస్తుందోనని భయపడ్డాం. నేనే చొరవ తీసుకొని మాలతితో మాట్లాడాను. ఆమె తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి

సుముఖంగా లేదు. విడాకుల గురించి కూడా ఆమె విచారించలేదు.

సీతారామయ్యగారితో ఈ సంగతి చెప్పాను. ఆయన చాల చితికి పోయారు. కూడబెట్టిన ఆరున్నర లక్షల రూపాయలు మాలతి పెళ్ళికి ఖర్చయాయి. విడాకుల కోసం కోర్టు కెక్కాలి. కేసు నడపడానికి కూడా అతని దగ్గర ఏమీ లేదు. నేను ఆ భారం నా మీద వేసుకున్నాను. లాయరును కలిసే ముందు మాలతి నాతో ఒక మాట అంది. "బాబయ్యగారు! భరణాల గురించి ప్రయత్నాలు చేయకండి. ఆ పుణ్యమో పురుషార్థమో వారికే దక్కనీయండి."

ఆనాటి నుండి మాలతి స్వతంత్రంగా నిలబడింది. బాంకు పరీక్ష పాసయి మా వూరి బాంకులో అసిస్టెంటు మేనేజరుగా చేరింది. తన ఉద్యోగం, తన పుస్తకాలు, ఈ విధంగా మళ్లీ నవ్వుతూ నవ్వించే మాలతి పునర్జన్మ ఎత్తింది.

విడాకుల కేసు ఆరు నెలలు నడిచింది. నాకు లక్షా ఏభై వేలు ఖర్చయింది.

నేను చాల ముందాలోచనలకు పోయాను. జీవితంలో స్త్రీ గాని, పురుషుడుగాని ఒంటరిగా ఉండడం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. మాలతికింకా ఇరవై ఎనిమిదేళ్ళు జీవితమంతా ముందుకు ఉంది. సీతారామయ్యగారు పెద్దవాళ్లయారు. మాలతి తన సంతోషం, బాధ పంచుకోవడానికి మరొకరు కావాలి. అందరివలెనే పిల్లలను కనాలి. సమాజంలో బాధ్యతగల వ్యక్తిగా సంపూర్ణంగా జీవించాలి.

ఇప్పుడు నేను అదే ప్రయత్నంలో, యోగ్యుడైన వాడిని వెతుకుతున్నాను.